RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక



# జర్నలిస్టుల స్థలాలపై వేసిన కేసును ఉపసంహరించుకోవాలి

**న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం**

**- సీపీఐ నేత మర్రి వెంకటస్వామి**

**ప్రభుత్వమే ఇచ్చిన పట్టాలను కాపాడాల్సిన బాధ్యత నాయకుల, అధికారులదే..**

**- మూడో రోజుకు చేరిన జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలు..**



హుజూరాబాద్, ఆగస్టు 18 (వాయిస్ టుడే): ప్రభుత్వమే స్వయంగా పట్టాలు ఇచ్చి, సర్వే నంబర్లు కేటాయించి, ఇంటి నంబర్లు సైతం మంజూరు చేసిన జర్నలిస్టుల నివేశన స్థలాలపై అక్రమ కేసులు పెట్టి వారిని రోడ్డుపైకి లాగడం కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికి, అసమర్థతకు పరాకాష్ట అని సీపీఐ సీనియర్ నాయకులు మర్రి వెంకటస్వామి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యను పరిష్కరించకుండా అధికార యంత్రాంగం కాలయాపన చేస్తే సహించేది లేదని, అవసరమైతే ప్రజా సంఘాలు, అఖిలపక్ష పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి జర్నలిస్టుల నివేశన స్థలాలపై అక్రమంగా కేసులు నమోదు చేయించడాన్ని నిరసిస్తూ హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో పాత్రికేయులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన సిపిఐ సీనియర్ నాయకులు మర్రి వెంకటస్వామి జర్నలిస్టులకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. పట్టాలు ఇచ్చింది ప్రభుత్వమే.. రక్షించాల్సింది కూడా ప్రభుత్వమే..

ఉపఎన్నికల సమయంలో అప్పటి కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ తదితర అధికారుల సమక్షంలో ఇంటి నంబర్లు కేటాయించి, చట్టబద్ధంగా 120 గజాల స్థలాలకు పట్టాలు అందజేశారని వెంకటస్వామి గుర్తుచేశారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాల ఆధారంగా జర్నలిస్టులు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని, అందరికీ ఇంటి నంబర్లు సైతం మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వ రికార్డుల్లో స్పష్టంగా ఉన్న భూమి విషయంలో అధికారులు వాస్తవాలను న్యాయస్థానం ముందుంచి సమస్యను పరిష్కరించాల్సింది పోయి, కోర్టు పేరుతో చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. న్యాయస్థానం నుంచి ఎలాంటి స్టే ఉత్తర్వులు లేనప్పటికీ అధికారులు, నాయకులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి..

జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించడంతో పాటు, అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న బాధిత జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తక్షణమే స్పందించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, ఆర్డీవోలు వెంటనే దీక్షా శిబిరాన్ని సందర్శించి సమస్య పరిష్కారంపై లిఖితపూర్వక హామీ ఇవ్వాలని, లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత జర్నలిస్టులు, జేఏసీ నాయకులు వంగల హనుమంత్ గౌడ్, వేల్పుల రత్నం, ఓసి జెఏసి నాయకురాలు ప్రభావతిరెడ్డి, బీసీ జెఏసి నాయకులు చందుపట్ల జనార్ధన్, ముదిరాజ్ సంఘం నాయకులు కొలిపాక సమ్మయ్య, ప్రజా సంఘాల నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జమ్మికుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సింగ్ శ్రీనివాస్ మాట్లాడుతూ హుజూరాబాద్ జర్నలిస్టుల స్థలాలపై కోర్టు కేసును కాంగ్రెస్ నాయకుడు స్వామి రెడ్డి విత్ డ్రా చేసుకునేలా హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేయాలని లేనియెడల జమ్మికుంట ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల వార్తలను బహిష్కరిస్తామని జమ్మికుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సింగ్ శ్రీనివాస్ హెచ్చరించారు. హుజూరాబాద్ జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు జమ్మికుంట ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత కొన్నేళ్లుగా హుజూరాబాద్ జర్నలిస్టులు ఎదురుచూస్తున్న నివేషణ స్థలాలను పొందినప్పటికీ వాటిపై కాంగ్రెస్ నాయకుడు స్వామి రెడ్డి కేసు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట జర్నలిస్టులు నసిరుద్దీన్, సదానందం, భీమన్న, సాయికుమార్, రవి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది విగ్రహం తొలగింపుపై మాజీ ఏమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆగ్రహం



వరంగల్( వాయిస్ టుడే ) ఆగష్టు 18 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమానికి విశేషంగా కృషి చేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే, ఉద్యమ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడం బాధాకరమని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం గృహనిర్బంధంలో ఉన్న ఆయన తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మరణించిన వ్యక్తిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒక విగ్రహాన్ని తొలగిస్తే.. నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు పలు చోట్ల పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. అప్పుడు పోలీసు యంత్రాంగం ఏం చేస్తుందని ప్రశ్నించారు.

**ఉద్యమ నేత విగ్రహం ఎందుకు తొలగించారు?**

బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తూ.. తెలంగాణ కోసం పోరాడిన పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడం ఏమిటని నరేందర్ ప్రశ్నించారు. ప్రజల మనోభావాలను గౌరవించకుండా తీసుకున్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి అంత్యక్రియల అనంతరం ఆయన అస్తికలను భద్రాచలంలో కలపకముందే ఆయన కుటుంబంపై వివక్ష చూపడం ఎందుకని ప్రశ్నించారు. పెద్ది కుటుంబంపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

**ప్రతి గ్రామంలో విగ్రహాలు: నరేందర్**

పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని నరేందర్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. నర్సంపేట ప్రజలు ఇప్పటికే బయటకు వచ్చారని, రానున్న ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. ప్రజల ఆగ్రహాన్ని ప్రభుత్వం, అధికార యంత్రాంగం గుర్తించాలని నరేందర్ అన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపు వ్యవహారంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

## పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలి



తొర్రూరు, ఆగస్ట్ 18 వాయిస్ టుడే : బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు తొర్రూరు గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి భవనం ఎదురుగా ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజని రాజశేఖర్, గౌపా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం బహుజనులకు రాజ్యాధికారం కోసం అలుపెరగని పోరాటం చేసిన వీరుడు పాపన్న గౌడ్ అని అన్నారు. బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడి మొగలులను ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగరేసిన దీశాలి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు తూర్పాటి రవి, పేర్ల జంపన్న,గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్,జిఎస్పిఎస్ అధ్యక్షుడు దికొండ శ్రీనివాస్ గౌడ్, కెఎస్ పి ఎస్ గౌరవ అధ్యక్షులు శామకూరి ఐలయ్య గౌడ్,అధ్యక్షుడు నాగపురి అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కుంభం మహేష్ కుమార్ గౌడ్, ఎస్ఎస్ పిజిఎ అధ్యక్షుడు చీకటి అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గుర్రం వెంకన్న గౌడ్, గౌడ సంఘ నాయకులు మోడెం వెంకన్న గౌడ్, దేశగాని కుమార్ గౌడ్, కోటగిరి కుమార్ గౌడ్, తాళ్లపల్లి బిక్షంగౌడ్, శీలం లింగన్న గౌడ్, పెరుమాండ్ల రవి, గౌడ్, తాండాల ఎల్లా గౌడ్, రావుల రాములు, చల్లపల్లి హేమాద్రి గౌడ్,బొమ్మగాని ఓం ప్రకాష్, మోడెం సోమ నరసయ్య,మద్దెల యాకన్న, బోలగాని మహేష్,క్రాంతి, బొమ్మగాని మనోజ్, బొమ్మెర రాజేష్, బుచ్చి రాములు, బొలగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా కమర్షియల్ ఫ్లెక్సీలు ముద్రిస్తే చర్యలు తప్పవు

**- ఫ్లెక్సీ తయారీదారులకు బల్దియా కమిషనర్ వెంకన్న హెచ్చరిక.**

**- ఫ్లెక్సీలు ఏర్పాటుకు బల్దియా నుండి అనుమతుతి తప్పనిసరి.**

**- ఫ్లెక్సీ తయారీదారులతో సమావేశం నిర్వహించిన కమిషనర్.**




వరంగల్ ( వాయిస్ టుడే ) ఆగష్టు 18 : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో బల్దియా అనుమతులు లేకుండా కమర్షియల్ ఫ్లెక్సీలను ముద్రించినా, అనధికారికంగా ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తప్పవని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న స్పష్టం చేశారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో నగర పరిధిలోని ఫ్లెక్సీ తయారీదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సుందరీకరణకు విఘాతం కలగకుండా ఫ్లెక్సీల ముద్రణ, ఏర్పాటు విషయంలో పాటించాల్సిన నిబంధనలపై వారికి కమిషనర్ పలు సూచనలు చేశారు. కమర్షియల్ సంస్థలకు సంబంధించిన ఫ్లెక్సీలను ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ భవనాలు, జంక్షన్లు, మీడియన్లు, డివైడర్ల మధ్య ఉన్న టెలిఫోన్, విద్యుత్ స్తంభాలు, చెట్లపై ఏర్పాటు చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని తెలిపారు. నిబంధనలకు సంబంధించిన సర్క్యులర్ కాపీలను ఫ్లెక్సీ తయారీదారులకు అందజేసి, వాటికి అనుగుణంగానే ఫ్లెక్సీలను ముద్రించాలని ఆదేశిస్తామన్నారు. కమర్షియల్ సంస్థల యాజమాన్యాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలనుకుంటే బల్దియా సూచించిన ప్రాంతాల్లో ముందస్తు అనుమతులు పొందిన అనంతరం మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నగరంలోని ఫ్లెక్సీ తయారీదారులందరితో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు నిబంధనలు, ఆదేశాలను వారికి చేరవేస్తామని తెలిపారు. నగర సుందరీకరణను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. కమర్షియల్ సంస్థలు, ఫ్లెక్సీ యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తే మునిసిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. అనధికారిక ఫ్లెక్సీల నియంత్రణ, నగర సుందరీకరణకు సంబంధించి త్వరలో నగర పోలీస్ కమిషనర్‌తో సమావేశం నిర్వహించి, పోలీస్ శాఖ సహకారం కోరనున్నట్లు కమిషనర్ తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బల్దియాకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం సమాజానికి ఆదర్శం..బీసీ జేఏసీ నాయకుల ఉద్బోధ.**

**హుజురాబాద్ గౌడ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు.**

**అతిథిలుగా హాజరైన బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్**

హుజురాబాద్, ఆగస్టు 18 (వాయిస్ టుడే): హుజురాబాద్ పట్టణంలోని స్థానిక సైదాపూర్ రోడ్డులో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు హుజురాబాద్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశానికి అతిథిలుగా హాజరైన బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, గౌడ సామాజిక వర్గం ముద్దు బిడ్డగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కిలా షాపూర్ లో జన్మించి గోల్కొండ కిలా పై జెండా ఎగురవేసి మొగలాయిలను ఎదిరించిన మొనగాడు సర్వాయి పాపన్న గౌడ్, గౌడ సామాజిక వర్గానికి చెందడం చాలా గర్వంగా ఉందన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఉగ్గు పాలతోనే ఉద్యమ నేపథ్యాన్ని అలవర్చుకొని ఆనాటి మొగలులను ఎదిరించి భూస్వామ్య జమీందారీ జాగీర్దార్ల పెత్తం దారితనాన్ని రూపుమాప డానికి ఒక గెరిల్లా సైనిక దళాన్ని ఏర్పాటు చేసి తన జీవితాన్ని ధారబోసి మొగుల్లుల కుట్రలో వీర మరణం పొందిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, గౌడ సామాజిక వర్గంతో పాటు బీసీ సామాజిక వర్గ ప్రజల గుండెల్లో అజరామరంగా నిలుస్తాడన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని ఒక ఆదర్శంగా తీసుకొని బలహీన వర్గాల బిడ్డలు ఐక్యమత్యంతో రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు కదలాలని ఆకాంక్షించినారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ అధ్యక్షులు సందేల వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, బీసీ జాతీయ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గం మహిళా జనరల్ సెక్రెటరీ దేవసాని ప్రియదర్శిని, బీసీ జేఏసీ నాయకులు విలాసాగరపు వీరస్వామి, చీకట్ల సమ్మయ్య, మామునూరు ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, చల్లూరి రఘు చారి, పంజాల శ్రీధర్, దాసరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ లక్ష్యాల వైపు విద్యార్థులకు బిర్లా ఓపెన్ మైండ్స్‌లో ప్రేరణాత్మక మార్గదర్శనం

**కెరీర్, పోటీ పరీక్షలు, వ్యక్తిత్వ వికాసంపై నిపుణుల సూచనలు**

**ఉద్యోగ అవకాశాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లపై విలువైన సమాచారం**

వరంగల్, ఆగస్టు 18: విద్యార్థులు చదువులోనే కాకుండా జీవిత లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఎన్ఐటీ వరంగల్ రిటైర్డ్ సీనియర్ ఫిజిక్స్ ప్రొఫెసర్ దంతాల దినకర్ అన్నారు. బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సీనియర్ సెకండరీ విద్యార్థుల కోసం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని బిర్లా విద్యాసంస్థల చైర్మన్ చైర్మన్ డా. నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్య అవకాశాలు, వివిధ కోర్సులు, ప్రవేశ పరీక్షల విధానం, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పద్ధతులు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. సమయపాలన, క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే తత్వం ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని సూచించారు. వైఫల్యాలను భయపడకుండా వాటిని అనుభవాలుగా మలుచుకుని ముందుకు సాగాలని, విజ్ఞానంతో పాటు విలువలను కూడా అలవర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫిజిక్స్‌లోని కీలక అంశాలను సులభంగా బోధించడం ద్వారా విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రొఫెసర్ దినకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.




## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న 376 జయంతి కార్యక్రమం

వరంగల్ ఉమ్మడి జిల్లా ( వాయిస్ టుడే) ఆగష్టు 18: సర్దార్ సర్వాయి పాపన్న 376 జయంతిని భూపాల్ పల్లి కలెక్టర్ కార్యాలయం మంగళవారం అధికారికంగా ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ తెలంగాణ గౌడ సంఘం భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ మరియు భూపాల్ పల్లి డిసిసి ప్రెసిడెంట్ మరియు గ్రంథాలయ చైర్మన్ మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ వైస్ చైర్మన్ గౌడ సంఘం గ్రామ మండల జిల్లా రాష్ట్ర నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భీమ గాని యాదగిరి గౌడ్ మాట్లాడుతూ 350 సంవత్సరాల క్రితమే భూస్వాములు పెత్తందారులను దౌర్జన్యాలను ఎండగట్టేందుకు సబ్బండ వర్గాలు చాకలి మంగలి మాల మాదిగ దూదేకుల వడ్రంగు లను కలుపుకొని ఒక సైన్యాన్ని ఏర్పటు చేసి వరంగల్ నుండి హైదరాబాద్ గోల్కొండ ఖిలా వరకు తన సైన్యంతో శత్రువులపై యుద్ధం చేసి గోల్కొండ కోటను స్వాధీనం పరచుకొని పరిపాలన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, ఆయన్ని ఆదర్శంగా తీసుకొని బీసీలంతా ఒక తాటిపైకి వచ్చి మన ఎస్సీ ఎస్టీ సోదరులను కలుపుకొని రాజ్యాధికార కొరకు పోరాటం చేయాలన్నారు.

## కిరాణా వర్తకుల సంఘంతో పోలీసుల సమావేశం

తొర్రూరు, ఆగస్ట్ 18 వాయిస్ టుడే : తొర్రూరులో కిరాణా వర్తకుల సంఘం సభ్యులతో తొర్రూరు సీఐ గణేష్, ఎస్సై మహేందర్ రెడ్డి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం సరఫరా తగ్గుతున్న నేపథ్యంలో గుడుంబా తయారీదారులు ప్రస్తుతం చక్కెర వైపు దృష్టి సారించే అవకాశం ఉందని తెలిపారు. గుడుంబా తయారీదారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ చక్కెర లేదా ఇతర ముడి పదార్థాలను విక్రయించి సహకరించవద్దని వర్తకులను హెచ్చరించారు. నిషేధిత గుడుంబా తయారీకి అవసరమైన పదార్థాలను విక్రయించినట్లు గుర్తిస్తే, సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గణేష్, ఎస్సై మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. గుడుంబా నిర్మూలనకు పోలీసులకు సహకరించాలని వర్తకులను కోరారు.